

జంగిల్ సఫారీకి బ్రేక్



పులికూనలతో పెద్దపులి

నల్లమల అడవులు

పులికాంతకు ఏకాంతం..!

- రెండు నెలలపాటు ఎన్‌ఎస్‌టీఆర్‌లోకి నో ఎంట్రీ
- మూతబడనున్న పర్యాటక కేంద్రాలు
- నల్లమలలో జంగిల్ సఫారీలకు బ్రేక్
- పుణ్య క్షేత్రాలకు రాకపోకల నిలిపివేత

ఆత్మకూరు, ఆగస్టు 5:

ప్రపంచ వ్యాప్తంగా పెద్దపులులకు ఉన్న క్రేజ్ అందరికీ తెలుసు. పర్యావరణ సూచికలో అగ్రభాగాన నిలిచే పెద్దపులులను సంరక్షించేందుకు అన్ని దేశాలు కసరత్తు చేస్తున్నాయి. పులుల సంచారం అధికంగా ఉన్న ప్రాంతంలో పర్యావరణం సమతౌల్యంగా ఉంటుంది. అందుకే పులుల సంరక్షణకు అన్ని అంశాలను దూరదృష్టితో ఆలోచించి అటవీ అధికారులు ముందుకెళ్తుంటారు. ఈ క్రమంలోనే పులుల సంతాన ప్రక్రియకు వర్షాకాల సీజన్ అనుకూలం కావడంతో ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు రెండు నెలలపాటు నల్లమలలో పులులకు ఏకాంతం ఉండేలా అటవీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే నాగార్జున సాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలోకి జనసంచారాన్ని పూర్తిగా నిషేధించనున్నారు. ప్రతి ఏటా జూలై నుంచి సెప్టెంబరు వరకు ఆంక్షలు ఉండగా ఈసారి ఆగస్టు నుంచి సెప్టెంబరు వరకు అమలు చేస్తున్నారు.

వేటను మరచి.. సంపర్కంలోనే..



పెద్దపులులు

పెద్దపులులు జతకలిసే విధానం ఎంతో వైవిధ్యంగా ఉంటుంది. ఆడ, మగపులుల మూత్రం వాసనలు భిన్నంగా ఉంటాయి. ఆడపులి జత కలవాలని కోరుకున్న సమయంలో తన మూత్రవిసర్జనతో మగపులికి సంకేతాలు పంపిస్తోంది. అదే సమయంలో మగపులులు కూడా జత కలిసేందుకు ఉద్వేగంగా ఉండటంతో ఆడపులి మూత్రం సంకేతాలను గమనించి జత కలిసే ప్రయత్నం చేస్తుంది. పులులు సంపర్కం చెందే సమయంలో మూడు నుంచి ఐదు రోజులపాటు వేటను మరచిపోతాయి. ఈ వ్యవధిలో సుమారు వంద సార్లకు పైగానే పెద్దపులుల ఇష్టంతో సంపర్కం చెందుతాయి. అయితే ఇవి జత కలిసే ప్రదేశాలు వీలైనంత వరకు నీటి వనరులు ఉన్న ప్రాంతాలను ఎంచుకుంటాయి. ఎందుకంటే ఉద్వేగంతో జత కలిగిన అనంతరం మగపులి శరీరం బాగా వేడెక్కుతుంది. దీంతో తన శరీరాన్ని చల్లబరుచుకునేందుకు నీటిలోకి వెళ్లి సేదతీరుతుంది. ఇదిలావుంటే తనవితీరా జత కలిసిన ఆడపులి మరి కొన్ని నెలలపాటు సంపర్కం చెందేందుకు ఇష్టపడదు.

పులుల ప్రత్యుత్పత్తిలో ఇవే కీలకమైన రోజులు

పర్యావరణ సూచికగా నిలిచే పెద్దపులుల సంఖ్యను ఏటేటా పెంచాలని కసరత్తు జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పులుల సంఖ్యలో 75 శాతం దేశంలోనే ఉండటం గర్వకారణంగా చెప్పవచ్చు. 2023 పులుల లెక్కింపు ప్రకారం భారత్‌లో 3,167 ఉన్నట్లు అంచనా వేశారు. వాస్తవానికి జూలై నుంచి సెప్టెంబరు వరకు ఆడపులులు గర్భం దాల్చేందుకు అనువైన రోజులుగా పరిగణిస్తారు. వీటి గర్భధారణ సమయం 16 వారాలు ఉంటుంది. ఒక ఈతలో సుమారు కిలో బరువు గల 2 నుంచి 4 కూనలకు ఆడపులి జన్మనిస్తుంది. ఇవి గుడ్డిగా, నిస్సహాయంగా జన్మిస్తాయి. దట్టమైన ప్రాంతాలు, రాతిపగుళ్ల వంటి ప్రాంతాల్లో వాటిని వుంచి ఆడపులులు ఆహార సేకరణకు వెళ్తాయి. పూర్తి స్థాయిలో పులికూనలు ఆడపులుల పెంపకంలోనే ఉంటాయి. కొన్ని సందర్భాల్లో వాటితో సంబంధం లేని మగ పులులు ఆడపులులతో జత కూడటం కోసం పులికూనలను చంపేస్తాయి. ఎందుకంటే ముందు ఈతలో కూనలు చనిపోయినట్లయితే ఆడపులి తరువాతి ఈతకు ఐదు నెలలోపు సిద్ధమవుతుంది. మరణాల రేటు పులుల్లో చాలా అధికంగా ఉంటుంది. సగం కంటే ఎక్కువ పులులు రెండు సంవత్సరాల కంటే ఎక్కువగా బతకలేవని తెలిసింది.

3727.82 చ.కి.మీటర్లలో విస్తరించిన ఎన్ఎస్‌టీఆర్

దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వుఫారెస్ట్‌గా పేరుగాంచిన నాగార్జునసాగర్ -శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3727.82చ.కి.మీల పరిధిలో విస్తరించింది. ఇందులో 2444చ.కి.మీల కోర్ ఏరియా ఉండగా, 1283.82 కిమీల బఫర్ ఏరియా గుర్తించారు. కాగా ఎన్ఎస్‌టీఆర్‌లో 2023లో పెద్దపులుల గణాంకాల అంచనాల ప్రకారం 75 ఉండగా ప్రస్తుతం పులికూనలతో కలిపి 87 పులులు ఉన్నట్లు అటవీ అధికారుల అంచనా వేశారు. ఆగస్టు నుంచి సెప్టెంబరు నెలల్లో నల్లమలలో అడవుల్లో పులుల ప్రత్యుత్పత్తికి అనుకూలమైన పరిస్థితులు పుష్కలంగా ఉండటంతో ఇక్కడ పులుల సంతతి ఏటేటే వృద్ధి చెందుతోందని గణాంకాల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

పులుల ప్రత్యుత్పత్తి కోసమే ఆంక్షలు



ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు పులుల సంపర్కానికి అనుకూలమైన సీజన్ కావడంతో వాటి ప్రత్యుత్పత్తికి ఎటువంటి విఘాతం తలెత్తకుండా టైగర్ ప్రాజెక్ట్ పరిధిలో జనసంచారాన్ని పూర్తిగా నిషేధిస్తున్నాం. ప్రజలు కూడా ఈ విషయాన్ని గుర్తించుకొని అడవిలోకి వెళ్లే ప్రయత్నాలు చేయకుండా మాకు సహకరిస్తారని ఆశిస్తున్నాం. ఈ నేపథ్యంలోనే నల్లమలలోని ఇష్టకామేశ్వరి, రుద్రకోడూరు, గుండ్లబ్రహ్మేశ్వరం, గుమ్మితం తదితర క్షేత్రాలకు వెళ్లేందుకు అనుమతించడం జరగదు. అదేవిధంగా ఎకోటూరిజం కేంద్రాలను, జంగిల్ సఫారీలను కూడా రెండు నెలల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తాం. పర్యావరణానికి సూచికగా నిలిచే పులులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

\- వీ. సాయిబాబా డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్ ఆత్మకూరు



జత కలిసేందుకు సమయం ఆసన్నం



సహజంగా పెద్దపులుల ప్రత్యుత్పత్తి ప్రక్రియ అన్ని సీజన్లలో ఆశాజనకంగా ఉండదు. అన్ని జంతువుల తరహాలో కాకుండా పులి ఓ ప్రత్యేకమైన జీవన విధానాన్ని అలవర్చుకుని సంతాన ప్రక్రియను సాగిస్తుంది. ఇందులో భాగంగానే జూలై నుంచి సెప్టెంబరు వరకు వర్షాకాల సీజన్‌లో మాత్రమే పెద్దపులులు ఎక్కువగా జత కలిసేందుకు ఇష్టపడతాయని వన్యప్రాణి నిపుణులు చెబుతారు. దీంతో నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) సూచనల మేరకు పెద్దపులులు జత కలిసే సమయంలో వాటికి ఏచిన్న విఘాతం తలెత్తకుండా టైగరు ప్రాజెక్ట్‌ల్లో అన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. ప్రత్యేకించి ఈ సమయంలో అడవుల్లోకి జనసంచారాన్ని అనుమతిస్తే అలజడి తలెత్తి పులుల ప్రత్యుత్పత్తికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందనే ఈ నిబంధనలను పాటిస్తున్నారు. అంతేగాకుండా పులులు జత కలిసే సమయంలో కోపోద్రిక్తంగా ఉంటాయని, అలాంటప్పుడు మనుషులు కనిపిస్తే దాడి చేసే అవకాశం కూడా ఉంటుందనే జన సంచారాన్ని పూర్తిగా నిషేధిస్తారు.

మూడు నెలల పాటు మూతబడనున్న బైర్లూటి ఏకోటూరిజం కేంద్రం



రెండు నెలల పాటు ఎన్ఎస్‌టీఆర్‌లోకి నో ఎంట్రీ

పులుల ప్రత్యుత్పత్తిని మెరుగుపర్చేందుకు ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు నాగార్జున సాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు కూడా జనానికి అనుమతించరు. ప్రత్యేకించి మార్కాపురం అటవీ డివిజన్‌లోని ఇష్టకామేశ్వరి అమ్మవారి ఆలయం, వెలుగోడు రేంజ్‌లోని రుద్రకోడూరు క్షేత్రం, గుండ్ల బ్రహ్మేశ్వర్యం అభయారణ్యం పరిధిలోని గుండ్ల బ్రహ్మేశ్వరాలతోపాటు ఆత్మకూరు డివిజన్‌లోని బైర్లూటి, నంద్యాల డివిజన్‌లోని పచ్చర్ల, మార్కాపురం డివిజన్‌లోని తుమ్మలబయలు ఎకో టూరిజం కేంద్రాలు, జంగిల్ సఫారీలకు బ్రేక్ వేశారు. ఇప్పటికే ఆయా పర్యాటక కేంద్రాలకు సంబంధించిన ఆన్‌లైన్ బుకింగ్ సేవలను నిలిపివేశారు. అంతేగాకుండా ఈసమయంలో కర్ణాటక భక్తులు కొందరు శ్రీశైలానికి అటవీ మార్గంలో పాదయాత్రగా వెళ్తుంటారు. అలాంటి వారికి అనుమతించబోమని అటవీ అధికారులు చెబుతున్నారు.

బాలిక ప్రసన్నకు అండగా ఉంటాం

రూ.10 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే అఖిలప్రియ



చిన్నవంగలిలో బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చాగలమర్రి, ఆగస్టు 5: మండలంలోని చిన్నవంగలిలో మట్టిమిద్దె కూలి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెంది అనాథగా మిగిలిన బాలిక ప్రసన్నకు అండగా ఉంటామని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం చిన్నవంగలి గ్రామంలో కూలిన మట్టిమిద్దెను పరిశీలించారు. అనంతరం ప్రసన్నను ఓదార్చి అండగా ఉంటామంటూ మనోధైర్యం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టిమిద్దె కూలి నలుగురు మృతి చెందడం దురదృష్టకరం అన్నారు. బాలిక ప్రసన్నకు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించిన రూ.10 లక్షల చెక్కు, ప్రసన్న బాగోగులు చూసుకునే నాయనమ్మకు రూ.2 లక్షలు చెక్కును అందజేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రసన్న చదువు గురించి మాట్లాడారని, బాలికను ఎన్టీఆర్ స్కూల్‌లో చదివిస్తామని హామీ ఇచ్చారు. చదువుతోపాటు పెళ్లి అయ్యే వరకు తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. కొత్తగా గృహాలు మంజూరైన వెంటనే మట్టిమిద్దెలు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి ప్రసన్నను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, వీఆర్వో సుబ్బరాయుడు, కార్యదర్శి నాగార్జున, టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వం తోడుగా నిలిచింది

అమ్మా నాన్న, అక్కా, చెల్లి మరణించి దిక్కుతోచని స్థితిలో ఉన్న తనకు ప్రభుత్వం అండగా నిలిచిందని బాలిక ప్రసన్న తెలిపింది. సోమవారం ప్రసన్న మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, కలెక్టర్ తనకు అండగా నిలిచి భరోసా ఇచ్చారని అన్నారు.

ఎస్ఐ, కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌కు రంగం సిద్ధం..!

సీతారామపురం హత్య ఘటనలో అధికారుల నిర్ణయం?



సీతారామపురంలో పోలీస్ పికెట్

మహానంది, ఆగస్టు 5: మహానంది మండలం సీతారామపురం గ్రామంలో వైసీపీ కార్యకర్త సుబ్బరాయుడు అలియాస్ పెద్దన్న (68) దారుణ హత్య విషయంలో పోలీసులు కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియకుండా ఉంచి పరిస్థితిని జటిలం చేసినందుకు ఎస్ఐను, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయనున్నట్లు సమాచారం. సీతారామాపురం గ్రామంలో జరిగిన హత్య ఒక్కసారిగా కలకలం రేపింది. టీడీపీ నాయకుడు బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆయన అనుచరులు తన ప్రత్యర్థి జయనారపురెడ్డిపైన దాడి చేసేందుకు వచ్చారని తెలిసి, కేవలం జయనారపురెడ్డికి మాత్రమే పోలీసులు బందోబస్తు కల్పించారు. దీనికి తోడు గ్రామంలో ఏం జరుగబోతుందోనన్న విషయాన్ని పసిగట్టలేకపోవటమే కాకుండా, తమను హెచ్చరించిన శ్రీనివాసరెడ్డి తదితరుల ధాటికి భయపడి కనీసం ఉన్నతాధికారులకు పోలీసులు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ క్రమంలో శ్రీనివాసరెడ్డి అనుచరులు సుబ్బారాయుడిపై దాడి చేసి హతమార్చారు. అంతేకాకుండా ఆయన భార్య బాల సుబ్బమ్మ మీద కూడా దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన నివారణలో పోలీస్ శాఖ ఘోరంగా విఫలమైంది. దీంతో సంబంధిత అధికారులపై వేటుకు రంగం సిద్ధమైంది. ఇదిలా ఉండగా సుబ్బరాయుడు హత్యతో సీతారామపురంలో సీఐ, ఇద్దరు ఎస్ఐలతో పాటు మరో 30 మంది సాయుధ పోలీస్ బలగాలతో పోలీసుల పికెట్ ఏర్పాటు చేశారు. సోమవారం డీఎస్పీ రమాకాంత్ సీతారామపురం సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఒక్కసారిగా హత్య జరగడంతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు.

శ్రీశైలం ఇన్‌ఫ్లో 3,44,218 క్యూసెక్కులు

శ్రీశైలం, ఆగస్టు 5: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ఉధృతి సోమవారం కొనసాగింది. జూరాల, సుంకేసుల నుంచి వరద ప్రవాహం కొనసాగడంతో డ్యామ్ క్రస్టుగేట్లను సోమవారం 10 క్రస్టుగేట్లును 12 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 2,69,768 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 99,153 క్యూసెక్కులు మొత్తం 368,921 వరద ప్రవాహం వస్తుంది. సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి 3,44,218 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883.00 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 204.7889 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 26,481 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,857 క్యూసెక్కుల, డ్యామ్ క్రస్టుగేట్ల ద్వారా 3,10,840 క్యూసెక్కులు మొత్తం 3,75,178 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

గుడ్డు.. వెరీ బ్యాడ్..!

- కొండెక్కిన కోడిగుడ్డు ధర
- రిటైల్ మార్కెట్లో రూ.7కు చేరిన వైనం
- కొనలేకపోతున్న సామాన్యులు



కొలిమిగుండ్ల, ఆగస్టు 5: కోడి గుడ్డు ధర కొండెక్కింది. దీంతో సామాన్యులు కొనాలంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఓ పక్క బహిరంగ మార్కెట్లో కూరగాయలు ధరలు మండిపోతుంటే కోడి గుడ్ల ధరలు సైతం అందనంత ఎత్తుకు చేరుకున్నాయని ప్రజలు వాపోతున్నారు. గత ఏప్రిల్‌లో రూ.4 నుండి రూ.4.50 వరకు పలికిన కోడ్డి గుడ్ల ధరలు, మే నెలలో రూ.5, 5.50కు చేరాయి. ఇక జూన్, జూలై నెలల్లో అంతకంతకూ పెరుగుతూ కొద్ది రోజుల్లోనే రూ.6.00, రూ.6.50కు చేరుకోవడంతో వినియోగదారులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. మరోవైపు మారుమూల పల్లెల్లో చిల్లరగా అయితే కోడి గుడ్లు రూ.7.50 వరకు విక్రయిస్తున్నట్లు గ్రామీణ ప్రజలు వాపోతున్నారు. ఎంతో కాలంగా చికెన్, మటన్ ధరలు మండుతుండటంతో, పలువురు మాంసాహారులు కోడి గుడ్లతో సరిపెట్టుకుంటున్నారు. అయితే ప్రస్తుతం కోడి గుడ్ల ధరలు కూడా అమాంతం పెరగడంతో వారికి దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకనే..

మార్కెట్లో కోడి గుడ్ల వినియోగం భారీగా పెరిగింది. సాయంత్రం అయితే చాలు తోపుడు బండ్లపై ఆమ్లెట్లు, న్యూడిల్స్ తదితర ఫాస్ట్ ఫుడ్‌లో గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. వినియోగానికి తగినంత ఉత్పత్తి పెరగకపోవడంతోనే గుడ్ల ధరలు పెరుగుతున్నాయని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. జిల్లాలో ప్రతి రోజూ లక్షకు పైగా కోడి గుడ్ల వినియోగం జరుగుతున్నట్లు వ్యాపార వర్గాల అంచనా. జిల్లాకు అత్యధికంగా మహబూబ్‌నగర్, హైదరాబాదు, బెంగళూరు నుంచి గుడ్లు దిగుమతి జరుగుతుంది. వర్షాకాలం ప్రారంభమైనందున గుడ్ల ధరలు త్వరలోనే తగ్గే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

ఇంకెన్నాళ్లు..?

- తహసీల్దార్ల స్థానాల కేటాయింపులో ఆలస్యం
- పోస్టింగుల కోసం కొందరి లాబీయింగ్
- నంద్యాల జిల్లాలో కొన్ని మండలాలు ఖాళీ

నంద్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్లకు స్థానాల కేటాయింపుల విషయంలో భారీగా లాబీయింగ్ నడిచిందని తెలుస్తోంది. తమకు ఉన్న అన్ని పరిచయాలను ఉపయోగించుకుని తమకు అనుకూలంగా ఉన్న మండలాల్లో పోస్టింగులు వేయించుకునేందుకు ఆయా తహసీల్దార్లు విశ్వ ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తమను సొంత జిల్లాలకు పంపిస్తున్నదని తెలియగానే లాబీయింగ్ మొదలుపెట్టారు. ఇందుకోసం భారీగా డబ్బు సమర్పించుకునేందుకు కూడా కొంతమంది వెనుకాడలేదు. అయితే వారు కోరుకున్న చోటే పోస్టింగ్ ఇస్తే వారి గత చరిత్ర వల్ల ఏమైనా ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతో.. వారికి మద్దతునిచ్చే నాయకులు తటపటాయించారు. దీంతో ఆయా తహసీల్దార్లకు కాస్త అటు ఇటుగా వారికి అనుకూలంగా ఉన్న చోటే పోస్టింగులు ఇప్పించారు. ఉదాహరణకు నంద్యాల తహసీల్దారుగా వచ్చేందుకు ప్రయత్నించిన ఓ అధికారి చివరగా నంద్యాల కలెక్టరేట్‌లోనే పోస్టింగ్ దక్కించుకున్నట్లు సమాచారం.


ఆ మంత్రి నిక్కచ్చిగా ఉంటారని..

జిల్లాలోని ఆయా తహసీల్దార్లకు జిల్లా యంత్రాంగం విడతల వారీగా స్థానాలను కేటాయించింది. అదికూడా కొంతమందికే కేటాయించడంతో ఇంకా దాదాపు 11 మండలాలకు తహసీల్దార్లను కేటాయించాలి. ముఖ్యంగా బనగానపల్లె లోని అన్ని మండలాలకు తహసీల్దార్లను కేటాయించాల్సి ఉంది. అయితే మిగిలి ఉన్న తహసీల్దార్లలో చాలామంది ఆ నియోజకవర్గానికి వెళ్ళేందుకు భయపడుతున్నారు. ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడం, ఎలాంటి అవకతవకలు జరిగినా ఉపేక్షించరన్న పేరు ఆయనకు ఉండటంతో అధికారుల్లో గుబులు రేపుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఆయనకు అధికారం లేకపోయినా, వైసీపీ నేతల మాటలు విని తప్పు చేసిన అధికారులను బీసీ జనార్దన్‌రెడ్డి ఉపేక్షించలేదు. అలాంటి అధికారుల మీద ఆయన కోర్టుకు సైతం వెళ్లిన ఘటనలున్నాయి. ప్రస్తుతం స్థానాల కేటాయింపులో భాగంగా బనగానపల్లె నియోజకవర్గంలో పోస్టింగ్ వస్తే నిక్కచ్చిగా పనిచేయాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో చేతి వాటాలకు అలవాటైన కొంతమంది అధికారులకు ఆ విషయం ఇబ్బందిని కలిగిస్తోంది. ఇక నంద్యాల, మహానంది, గోస్పాడు, డోన్, బండి ఆత్మకూరు వంటి మండలాలకు కూడా పోస్టింగులు ఖరారు చేయాల్సి ఉంది.

సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నికల విధుల్లో భాగంగా జిల్లాకు చెందిన తహసీల్దార్లను రాయలసీమలోని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఎన్నికలు ముగియగానే ఆ తహసీల్దార్లను సొంత జిల్లాకు బదిలీ చేశారు. వారంతా వచ్చి జిల్లా యంత్రాంగానికి రిపోర్టు కూడా చేశారు. వీరిలో ఇప్పటికే కొంతమందికి పోస్టింగులు ఖరారు చేసినా, మిగిలిన వారికి ఇంకా స్థానాలను కేటాయించలేదు. ఇలా మిగిలిపోయిన వారు తమకు ఫలానా మండలం కావాలని గట్టిగా లాబీయింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే కొంతమంది పోస్టింగుల్లో ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది. పక్కనే ఉన్న కర్నూలు జిల్లాలోని తహసీల్దార్లకు పోస్టింగులు కేటాయించటమే కాకుండా, అందరికీ ఒకేసారి ఆర్డర్లు అందాయి. కానీ నంద్యాల జిల్లాలో మాత్రం విడతల వారీగా ఎందుకు ఆర్డర్లు వస్తున్నాయి? మిగిలిన వారికి ఎందుకు పోస్టింగులు ఇవ్వలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.



నంద్యాల కలెక్టరేట్



ముమ్మర ప్రయత్నాలు

తహసీల్దార్ల పరిస్థితి ఇలా ఉంటే కొన్ని చోట్ల డిప్యూటీ తహసీల్దార్లు ఆయా మండలాలకు తమనే ఇన్‌చార్జులుగా నియమించాలంటూ ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇప్పటికే ఓ ఇద్దరు అధికారులు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తెగ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇందులో ఓ అధికారి ఏకంగా తనపై గతంలో ఉన్న ఆరోపణలకు సంబంధించి క్లీన్‌చిట్ తెచ్చుకోవటమే కాకుండా, ఉన్న చోటే ఇన్‌ఛార్జిగా పోస్టింగ్ ఆర్డర్లు తెచ్చుకునేందుకు విశ్వ ప్రయత్నాలు కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఆయన కాస్త మితిమీరి కూడా వ్యవహరించారు. ఆయనకు సంబంధించిన ఫైల్‌ను ఉన్నతాధికారులకు చేర్చే క్రమంలో ఫైల్ ఒక్కరోజు కనిపించకుండా పోయింది. ఫైల్ పైన సంతకాల గురించి ఆరా తీసే క్రమంలో తన ఫైల్ కనిపించకపోవటంతో తన తోటి డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి వెళ్లి సంబంధిత కార్యాలయంలో నానా హంగామా చేసినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో వీరిద్దరూ పూర్తిగా వైసీపీకి సహకరించారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు 105 దరఖాస్తులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ ఎస్పీ

నంద్యాల క్రైం, ఆగస్టు 5: ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా బొమ్మలసత్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై 105 దరఖాస్తులు వచ్చాయని అడిషనల్ ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో అడిషనల్ ఎస్పీ కె. ప్రవీణ్‌కుమార్ వినతులు స్వీకరించారు. ఆయన నేరుగా ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకొని స్వయంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని ఏఎస్పీ అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చినవాటిల్లో సివిల్ తగాదాలు, కుటుంబకలహాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో మనస్పర్థలు తదితరాలున్నాయని ఏఎస్పీ తెలిపారు. బండిఆత్మకూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రామలీలావతమ్మ హైదరాబాద్‌లోని ఉషోదయం కాలనీలో జీ-1 ఫ్లాట్ రూ.49లక్షలకు అమ్ముతానని చెప్పి తన వద్ద రూ.35లక్షలు తీసుకొని 4నెలల తర్వాత రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి తనకు తెలియకుండా వేరేవాళ్లకు రిజిస్ట్రేషన్ చేయించారని ఈ విషయంలో న్యాయం చేయాలని నంద్యాలకు చెందిన ఎం. రామచంద్రయ్య ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. అలాగే వెలుగోడుకు చెందిన కార్పెంటర్ శివయ్య ఫర్నిచర్ తయారు చేయడానికి తనవద్ద రూ.40వేలు అడ్వాన్స్‌గా తీసుకొని 3నెలలు దాటినా ఫర్నిచర్ తయారుచేయకుండా తిప్పుతున్నాడని న్యాయం చేయాలని గిద్దలూరుకు చెందిన బి.గుండయ్య ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం జెడ్పీహైస్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న షేక్ ఖాసింవలి అల్లా అనే వ్యక్తి కుటుంబ అవసరాల నిమిత్తం తనవద్ద రూ.7లక్షల పైచిలుకు అప్పుగా తీసుకున్నాడని నంద్యాలకు చెందిన షేక్ కరిముల్లా ఏఎస్పీ దృష్టికి తెచ్చారు. చాలామార్లు తన అప్పు చెల్లించాలని కోరగా కొంతమొత్తం తీర్చాడని మిగతా రూ.2,97,730 ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా ఎగవేయాలని చూస్తున్నాడని తనకు న్యాయం చేయాలని ఏఎస్పీని ఆశ్రయించాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

హాలహర్వి, ఆగస్టు 5: మండలంలోని బాపురం గ్రామానికి చెందిన సురేష్ (29) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. ఆదివారం రాత్రి బెంగళూరుకు కారులో వెళుతుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన సురేష్‌ను బళ్లారి ఆసుపత్రి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చిన్న వయస్సులో ప్రమాదవశాత్తు సురేష్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబాన్ని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

దేవనకొండ, ఆగస్టు 5 : లారీ- కారు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన మదన్‌మోహన్ తన కుటుంబ సభ్యులతో కలసి మహాబలేశ్వరం, గోకర్ణ దైవదర్శం ముగించుకొని తిరిగి హైదరాబాదుకు వెళ్తుండగా ఆదివారం రాత్రి కర్నూలు-బళ్లారి రహదారిపై కరివేముల సమీపంలో కర్నూలు నుండి వస్తున్న లారీ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మదన్‌మోహన్, మనోహర్, విజయ, రాధిక, సవారమ్మలతో పాటు మరో చిన్నారి గాయపడ్డారు. వారిని కర్నూలు వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుల అరెస్టు

ప్యాపిలి, ఆగస్టు 5: పట్టణంలోని బీసీ కాలనీలో ఈ నెల 4న బలరాముడు అతని భార్య రంగమ్మ, కొడుకు పులి శేఖర్‌లపై వేట కొడవళ్లతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిందితులను విలేకర్ల సమావేశంలో హాజరుపరిచారు. నిందితులు కమలాకర్, శేఖర్, కళ్యాణ్, దివాకర్, లక్ష్మి, సునిత అరెస్టు చేసినవారిలో ఉన్నారు. పొలం బోరు విషయంలో మూడు నెలల క్రితం కమలాకర్, బలరాముడు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. కమలాకర్ ఈ గొడవ దృష్టిలో పెట్టుకొని బలరాముడు కుటుంబంపై కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు సీఐ తెలిపారు. అరెస్టు చేసిన వారిని రిమాండ్‌కు పంపామన్నారు.నిందితులను అరెస్టు చేసిన రాచెర్ల ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

గురు రాఘవేంద్ర పంప్‌హౌస్‌లో పరికరాలు ధ్వంసం

- బసలదొడ్డి స్టేజీ పంప్‌హౌస్‌కు రూ.12 లక్షల నష్టం
- 8 రోజులు గడవకముందే మరో విధ్వంసం


ధ్వంసమైన ఫీడర్

మంత్రాలయం, ఆగస్టు 5: కర్నూలు జిల్లా మంత్రాలయంలో తుంగభద్ర నది ఒడ్డున ఉన్న గురురాఘవేంద్ర ప్రాజెక్టు (జీఆర్‌పీ) బసలదొడ్డి రిజర్వాయరు పంప్‌హౌస్ స్టేజీ-1పై దుండగులు ఇంజన్లను, స్టాటర్లు, కెపాసిటర్లను పగులకొట్టి, అందులో కాపర్‌ను దోచుకెళ్లారు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మాధవరం సమీపంలో ఉన్న గురు రాఘవేంద్ర పంప్ హౌస్ ముందుబాగంలో ఉన్న షట్టర్‌ను గడ్డపారలతో పగులకొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంజన్‌లో ఉన్న 100 కేవీఏ ఫీడర్లు కెపాసిటర్లు, పంప్‌బేరింగ్ ప్లేట్లు, కాపర్‌పైపు, తదితర వస్తువులను పగులకొట్టి అందులో కాపర్ ప్లేట్లను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేశారు. అయితే గస్తీలో తిరుగుతున్న పోలీసు వాహనాన్ని చూసి కాపర్ ప్లేట్లను ఎత్తుకెళ్లి పంప్‌హౌస్ నుంచి 500 మీటర్ల దూరంలో ఉన్న పత్తిపంటలో పడేశారు. విషయం తెలుసుకున్న ఆపరేటర్లు, జీఆర్‌పీ అధికారులు ఈఈ భాస్కర్ రెడ్డి, డీఈ కృపానిధి, ఏఈ హరిప్రసాద్‌కు సమాచారం ఇవ్వడంతో సోమవారం ఉదయం మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ శివనారాయణ స్వామి, ఆదోని టూటౌన్ సీఐ గోపి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, మంత్రాలయం సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తిలు పరిశీలించి డాగ్ స్క్వాడ్, క్లూజ్ టీమ్‌తో విచారణ చేపట్టి వేలిముద్రలు సేకరించారు. చోరీకి ముందుగానే దుండగులు ఒక చొక్కా, టవల్‌ను అక్కడే వదిలేశారు. ఆ చొక్కాపై కర్ణాటకలోని శక్తినగర్ అనే ఊరి టైలర్ పేరు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా వారి వద్ద ఉన్న టవల్ స్వాధీనం చేసుకున్నారు. 500 మీటర్ల దూరంలో పత్తి పొలంలో పోలీసులను చూసి పరారై పంప్ కాపర్ వైరు, బేరింగ్ ప్లేట్లను పడేసి వెళ్లారు. దీంతో గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీకి పాల్పడింది కర్ణాటక వ్యక్తులు అయి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత 8 రోజుల క్రితం జీఆర్‌పీలోని మాధవరం పంప్‌హౌస్ స్టేజీ-1 ధ్వంసం జరిగిన సంఘటన మరువక ముందే మళ్లీ బసలదొడ్డి రిజర్వాయరు పంప్‌హౌస్‌ను బద్దలుకొట్టి చోరీ జరగడంతో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ధ్వంసంపై సీఐడీతో విచారణ జరిపించాలి



వారం రోజుల్లో గురు రాఘవేంద్ర మాధవరం పంప్ హౌస్-1, బసలదొడ్డి రిజర్వాయర్ పంప్‌హౌస్‌లో రాజకీయ కుట్రలు, కసితో విధ్వంసం చేసిన సంఘటన మరవక ముందే ఆదివారం అర్ధరాత్రి బసలదొడ్డి రిజర్వాయర్‌స్టేజ్-1 విధ్వంసం చేసి పరికరాలు చోరీయత్నం చేసిన దుండగులపై సీఐడీ విచారణ చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. రెండు ప్రాజెక్టులు విధ్వంసం కావడంతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని ఆయన అన్నారు. పోలీసులు కేసు చేధించలేకపోతున్నారనీ సీఐడీకి అప్పగించి ధ్వంసానికి కారకులైన వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

\- పాలకుర్తి తిక్కారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు



తుంగభద్ర నది ఒడ్డున బసలదొడ్డి రిజర్వాయర్ పంప్‌హౌస్


పంప్‌హౌస్ షట్టర్‌ను పగులకొట్టిన దృశ్యం


దోచుకెళ్లిన పరికరాలు

ప్రారంభమైన శ్రావణ ఉత్సవాలు

- స్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం


ఎండలోనే స్వామి దర్శనం కోసం నిల్చుకున్న భక్తుల క్యూలైన్

కౌతాళం, ఆగస్టు 5: ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో శ్రావణ మాస ఉత్సవాలు సోమవారం ఆరంభమయ్యాయి. భక్తులు స్వామి దర్శనానికి వేలాది సంఖ్యలో తరలి వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలతో అలంకరించారు. ఉత్సవాలు ప్రారంభానికి ముందే సౌకర్యాలు కల్పించాల్సిన అధికారులు వేలాలు వాయిదాలు పడటంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయలేకపోయారు. చివరికి సరైన నీటి సౌకర్యం కూడా కల్పించలేకపోయారు. ముఖ్యంగా చంటి పిల్లల తల్లులకు క్యూలైన్లలో కూర్చునే సౌకర్యం లేక ఇబ్బందిపడ్డారు. ప్రత్యేక క్యూలైన్లలో భక్తులకు ఎండ నుంచి ఉపశమనం కోసం షామియాలు ఏర్పాట్లు చేయలేదు. స్వామి దర్శనానికి మన రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ నుంచి భక్తులకు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసినది.

ఈఓ సెలవుపై వెళ్ళడంతో అస్తవ్యస్తంగా తయారైన పాలన

ఉత్సవాల ఏర్పాట్లలో నిమగ్నమైన మాజీ ఆలయ డిప్యూటీ కమిషనర్ హెజీ వెంకటేష్ ఉన్నట్టుండి ఆదివారం మధ్యాహ్నం 20 రోజుల పాటు సెలవులపై వెళ్ళడంతో ఉత్సవాల ఏర్పాట్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. అధికార పార్టీ నాయకులు, ఆలయ అర్చకుల ఒత్తిడితోనే ఆయన సెలవులో వెళ్ళినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆదివారం డీసీగా బాధ్యతలు చేపట్టిన గురుప్రసాద్ ఉత్సవాలకు కొత్త కావడంతో కొంత మంది వ్యాపారుల ఆటలకు అడ్డులేకపోయింది.


ఆలయ ముఖద్వారంలోనే కొబ్బరి చిప్పలు పడివున్న దృశ్యం

టెంకాయ చిప్పలు ఎవరికి?

స్వామి వారికి భక్తులు సమర్పించే టెంకాయలను సరఫరా చేసేందుకు టెండర్లు కోర్టు పరిధిలో ఉండగా కొంత మంది ప్రైవేటు వ్యక్తులు వ్యాపారులకు టెంకాయలను సరఫరా చేస్తున్నారు. అయితే కొబ్బరి చిప్పల సేకరణకు వేలాలు లేకపోవడంతో ప్రస్తుతం వీటిని ఎవరు పోగు చేసుకుంటున్నదీ అర్థం కావడం లేదు. దీంతో ఆలయ ఆదాయానికి బారీగా గండిపడే ప్రమాదం ఉంది.

మిస్టరీ వీడిన హత్య కేసు

ఆస్పరి, ఆగస్టు 5: ఎమ్మిగనూరు మండలం మసీదుపురం గ్రామానికి చెందిన కురువ పెంటయ్య (45) హత్య కేసులోని మిస్టరీ వీడింది. ఆలూరు మండలం హాలేబీడు గ్రామం వద్ద ముగ్గురు దుండగులు పెంటయ్యకు మత్తు మందు ఇచ్చి అతని వద్ద నుంచి రూ.7.5 లక్షలు తీసుకుని హత్య చేసి ఆస్పరి మండలం చిన్నహోతూరు గ్రామ సమీప వంకలో వారం రోజులు కిందట డ్రమ్ములో కుక్కి పడేసిన విషయం విదితమే. గుర్తుతెలియని శవంగా ఆస్పరి అప్‌గ్రేడ్ సీఐ హనుమంతప్ప కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాల పరిశీలనలో.. ఎమ్మిగనూరు ఆటోవాలా ఇచ్చిన సమాచారం మేరకు మూడు గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు డబ్బు కోసం పెంటయ్యను హతమార్చినట్లు విచారణలో తేలింది. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా పని చేసిన ఆస్పరి పత్తికొండ, దేవనకొండ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ల సీఐలు హనుమంతప్ప, మురళీమోహన్, శ్రీనివాసులుతోపాటు ఆలూరు, హాలహర్వి పోలీసు స్టేషన్ల ఎస్ఐలు ఓబులేశు, నరేంద్ర, స్థానిక పోలీసు సిబ్బందికి పోలీసు ఉన్నతాధికారులు రివార్డు ప్రకటించి అందజేశారు.

వడ్డీ వ్యాపారి ఇంటి ముందు

బైఠాయించిన బాధితులు

పురుగు మందు డబ్బాలతో వడ్డీ వ్యాపారి ఇంటికి వెళ్లిన వైనం

ఎమ్మిగనూరు, ఆగస్టు5: పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న వడ్డీ వ్యాపారి రాజేష్‌గౌడు ఇంటి ముందు బాధితులు పురుగు మందు డబ్బాలతో బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బుడగ జంగం కాలనీలో నివాసం ఉంటున్న బుడగ జంగాల రంగన్నకు కర్నూలు బైపాసు రోడ్డులో 30సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలాన్ని పట్టణానికి చెందిన రాజేష్ గౌడు దగ్గర తనఖా పెట్టి వడ్డీకి కొంత డబ్బు అప్పు తీసుకున్నాడు. ఈ విషయంలో వివాదం చెలరేగడంతో సోమవారం రంగన్న భార్య మహాలింగమ్మ, అన్న కుమార్తె మైసమ్మ, కుమారుడు జోగి పురుగు మందు డబ్బాలతో రాజేష్ గౌడు ఇంటి ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. అనంతరం రాజేష్‌గౌడు బంధువు శ్రీనివాసగౌడు వచ్చి బాధితులకు నచ్చజెప్పి మీకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డిని వివరణ కోరగా.. ఈ విషయంలో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య

- మంత్రాలయం మోడల్ స్కూల్‌లో ఘటన
- విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేస్తామన్న సబ్ కలెక్టర్, డీఈవో, డీఎస్పీలు


పార్వతి (ఫైల్)

మంత్రాలయం, ఆగస్టు 5: మంత్రాలయం మండలంలోని రచ్చుమర్రి సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న పార్వతి (15) ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి జరిగింది. కురువ గుండప్ప, భీమలింగమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. ఆఖరి కూతురు పార్వతిని మోడల్ స్కూల్ హాస్టల్‌లో చేర్పించి, వారు బతుకుతెరువు కోసం హైదరాబాదుకు వలస వెళ్లారు. పార్వతి ఆదివారం రాత్రి భోజనం చేసి సోమవారం యూనిట్ టెస్టు ఉన్న కారణంగా చదువుకుంటానని ప్రత్యేక గదిలో రాత్రంతా చదువుకుంది. సోమవారం ఉదయం చూసేసరికి ఫ్యాన్‌కు తన చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని కనిపించింది. విద్యార్థులు వార్డెన్‌కు, ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ శివనారాయణ స్వామి మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి, ఇన్‌చార్జి సీఐ ఎమ్మిగనూరు టౌన్ సుదర్శన్ రెడ్డి కొత్తగా సీఐగా బాధ్యతలు తీసుకున్న రామాంజులు ఘటనా స్థలానికి వెళ్లి బాలిక మృతదేహాన్ని కిందకు దించి ఆసుపత్రికి తరలించారు. హైదరాబాదు నుంచి తల్లిదండ్రులు వచ్చేలోపే మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిస్తుండగా.. బంధువులు అడ్డుకుని సంఘటనా స్థలానికి చేర్చారు. ప్రజా సంఘాల నాయకులు, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యు విద్యార్థి సంఘాల నాయకులు రాస్తారోకో చేసి ధర్నా చేశారు. విద్యార్థినికి మృతికి గల కారణాలు తెలపాలని, మృతురాలి కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ధర్నా చేశారు. అక్కడకు వచ్చిన సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఈవో శామ్యూల్, డీఎస్పీ శివనారాయణ స్వామిలను అడ్డుకున్నారు.

బాలిక కుటుంబానికి న్యాయం చేస్తాం

ఆత్మహత్య చేసుకున్న పార్వతి మృతికి గల కారణాలు, అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిగ్గు తేలుస్తామని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఈవో శామ్యూల్ అన్నారు. బాలిక కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అక్కడే ఉన్న ప్రిన్సిపాల్ ప్రసాద్, వార్డెన్ సుజాతలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒంటరిగా ఒక గదిలో బాలిక ఎందుకు ఉందని, సీసీ కెమెరాలు ఎందుకు పని చేయడం లేదని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్, వార్డెన్లు నీళ్ల నమిలారు. ఇది చూసి తల్లిదండ్రులు కోపోద్రిక్తులై తమ కూతురు మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, సంఘటనా స్థలానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని పరిశీలించి భరోసా ఇచ్చారు.


రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు: డీఎస్పీ



బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ రామాంజి నాయక్

ఆత్మకూరు, ఆగస్టు 5: ఆత్మకూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ అన్నారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఇటీవల రాష్ట్రంలో జరిగిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ విభాగం డీఎస్పీగా బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఏలూరు ఎస్సీ, ఎస్టీ విభాగం డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రామాంజి నాయక్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా, సోమందేపల్లి మండలం, ఎన్ఎన్‌సీ తండాకు చెందిన రామాంజి నాయక్ 1995 బ్యాచ్‌లో ఎస్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి బద్వేలు, దువ్వూరు, ప్రొద్దుటూరు, ఎల్ఆర్‌పల్లి, పెండ్లిమర్రిగా పనిచేశారు. ఆ తర్వాత సీఐగా పదోన్నతి పొంది జమ్ములమడుగు, కొండాపురం, బద్వేలు, పులివెందుల, నంద్యాలలో పనిచేశారు. ఆతర్వాత 2020లో డీఎస్పీగా పదోన్నతి పొంది కర్నూలు, నంద్యాల, ఏలూరు ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా పనిచేస్తూ ప్రస్తుతం ఆత్మకూరుకు బదిలీపై వచ్చారు. దీంతో ఆయనను ఆత్మకూరు పోలీసు సబ్ డివిజన్‌కు చెందిన సీఐలు, ఎస్ఐలు మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ అవాంచనీయ ఘటనలకు తావివ్వకుండా సమన్వయంగా వ్యవహరిస్తానని తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలోని సీఐలతో ఆయన సమీక్షించారు.

నంద్యాల విద్యుత్ ఈఈగా శ్రీనివాసరెడ్డి



ఈఈ శ్రీనివాసరెడ్డి కి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఈ రామయ్య

నంద్యాల రూరల్, ఆగస్టు 5: నంద్యాల విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా శ్రీనివాసరెడ్డి సోమవారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నంద్యాల ఈఈ రమణారెడ్డి ప్రొద్దుటూరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రొద్దుటూరు ఈఈగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి నంద్యాలకు బదిలీపై వచ్చారు. సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. పరస్పర సహకారంతో, సమష్టి కృషితో ప్రజాసేవకు అంతరాయం కలగకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

'పారదర్శక పాలన అందిస్తాం'

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 5: మండలంలో పారదర్శక పాలన అందిస్తామని తహసీల్దార్ బి. శ్రీనివాసులు అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా సోమవారం నందికొట్కూరు తహసీల్దార్‌గా వచ్చిన బి.శ్రీనివాసులుకు నందికొట్కూరు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఘనంగా స్వాగతం పలికారు. కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం నుంచి ఇక్కడి బదిలీపై వచ్చారని, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ దామోదరరెడ్డి కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలానికి బదిలీపై వెళ్లినట్లు అధికారులు తెలిపారు. డీటీలు సత్యనారాయణ, కిషోర్, వీఆర్వోల సంఘం జిల్లా నాయకుడు నరసరాజు, వీఆర్వోలు సాములు, వెంకటేశ్వర్లు, స్వాములు, ఆనంద్, రషీద్, బుద్ధకవి, శ్రీనివాసులు, సురేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

జూపాడుబంగ్లా, ఆగస్టు 5: రెవెన్యూలో సమస్యల పరిష్కారినికి కృషి చేస్తామని తహసీల్దార్‌గా బాధతలు స్వీకరించిన చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన బాబు రాజేంద్ర ప్రసాద్ చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్లగా, అనంతపురం జిల్లా పామిడి మండల తహసీల్దాగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌నాయక్ సోమవారం జూపాడు బంగ్లా మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్లు నాగన్న, చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డితో పాట రెవెన్యూ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు తహసీల్దార్‌కు శాలువ, పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

ఆత్మకూరు తహసీల్దార్‌గా రత్నరాధిక

ఆత్మకూరు, ఆగస్టు 5: ఆత్మకూరు తహసీల్దార్‌గా రత్నరాధిక సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.బాబు ఇటీవల జిల్లాలో జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో అనంతపురం జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీ ఆత్మకూరుకు వచ్చారు. ఆమె మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖ తరుపున ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, రెవెన్యూ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

'కొత్తపల్లి మండల అభివృద్ధికి కృషి'

కొత్తపల్లి, ఆగస్టు 5: కార్యాలయ అధికారులు, సిబ్బంది, మండల, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో కొత్తపల్లి మండలాన్ని తనదైన శైలిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తహసీల్దార్ జి.ఉమారాణి అన్నారు. తహసీల్దార్‌గా సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. ఆమె గతంలో కూడా ఆత్మకూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. అయితే.. చిత్తూరు జిల్లాలోని కూడేరు మండల తహసీల్దార్‌గా ఆమె విధులు నిర్వహిస్తున్నారు. గత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇటీవల ప్రభుత్వం ఏయే జిల్లాలో అయితే విధులు నిర్వర్తించారో వారిని సొంత జిల్లాకు బదిలీ చేసింది. బదిలీల్లో భాగంగా ఉమారాణి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు స్థానిక కార్యాలయ అధికారులు వీఆర్వోలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రజలకు అందుబాటులో ఉండాలి'

వెలుగోడు, ఆగస్టు 5: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని తహసీల్దార్‌గా శ్రీనివాసగౌడ్‌అన్నారు. వెలుగోడు తహసీల్దార్‌గా సోమవారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా పుత్తూరు తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయన సార్వత్రిక ఎన్నికలు ముగిశాక తిరిగి సొంత నంద్యాల జిల్లాకు చేరుకున్నారు. ఆయన 2017 -18లో వెలుగోడు ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా, 2019లో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పని చేశారు. డీటీలు నారాయణ రెడ్డి, ఆంజనేయులు సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతించారు. అనంతరం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

స్నేహితుల చేయూత

పగిడ్యాల, ఆగస్టు 5: మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన పి. తిక్కస్వామి రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు చేయూతనందించారు. తిక్కస్వామి డ్రైవరుగా విధుఎలు నిర్వహిస్తూ కుటుంబానికి పోషించుకునేవాడు. గత కొద్దిరోజుల కిందట గ్రామానికి మోటర్‌బైక్ పై వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో కాళ్లు విరిగి మంచా నికి పరిమిత మయ్యారు. స్నేహితులు నిత్యావసర సరుకులు అందించారు. వెంకటస్వామి, స్వామన్న, అంజి, గంగాధర్, మునేంద్ర, మద్దిలేటి, నరసింహ, నాగేశ్వర రావు, మద్దిలేటి ఉన్నారు.

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలి: డీఆర్వో



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎఫ్‌బీ నాయకులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 5: ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మజ జిల్లా అధికారులను ఆదేశించారు. నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టం) కార్యక్రమంలో పాల్గొని జిల్లా నలుమూలల నుంచి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. డీఆర్వో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులకు ప్రాధాన్యమివ్వాలని డీపీవో మంజులావాణిని, పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి క్లోరినేట్ చేసిన నీటినే సరఫరా చేయాలన్నారు. తాగునీటి సమస్యలపై, పారిశుధ్య సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 79938-12160 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చొన్నారు. కార్యక్రమంలో 182 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి డీఆర్వోకు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్‌చేస్తూ డీఆర్వో ఆదేశాలు జారీ చేశారు.

● గడివేముల తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎల్లా సుబ్బయ్య, అటెండరు తిమ్మరాజును సస్పెండ్ చేయాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కార్యదర్శి రాజునాయుడు కోరారు. డీఆర్వోకు వినతి పత్రం అందజేశారు. రాజునాయుడు మాట్లాడుతూ వీఆర్ఏ నాగ అంజనమ్మ అంధురాలని, అయితే కార్యాలయ సిబ్బంది తాము తిన్న పేట్లను, క్యారియర్లను కూడా కడించుకోవడం దారుణమని అన్నారు. సూటిపోటి మాటలు అనడంతో పాటు, ఉద్యోగానికి పనికిరావంటూ చులకనగా మాట్లాడుతున్నారని అన్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని పక్షాళన చేయాలని, సోలార్ పరిశ్రమలో కూడా అనేక అవకతవకలకు కార్యాలయ సిబ్బందే సహకరించారని అన్నారు. కార్యాక్రమంలో ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, వేణుమాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత జవానుకు ఘన స్వాగతం



విశ్రాంత జవానుకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

వెలుగోడు, ఆగస్టు 5: పదవీ విరమణ పొంది స్వగ్రామానికి చేరుకున్న ఆర్మీ జవానుకు రేగడగూడూరులో సోమవారం గ్రామస్థులు, కుటంబ సభ్యులు, బంధువులు మిత్రులు ఘనంగా స్వాగతం పలికారు. రేగడ గూడూరు గ్రామానికి చెందిన రమేష్ నాయుడు అనే జవాను ఆర్మీలో విధులు నిర్వహిస్తూ జులై 31న మహారాష్ట్రలోని అమ్మద్‌నగర్‌లో పదవీ విరమణ పొందారు. ఆయన స్వగ్రామానికి చేరుకోవడంతో అభినందించి, పూలమాలలు వేసి ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఘన స్వాగతం పలికారు.

'ప్రణాళికతో ముందుకు సాగాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 5: విద్యార్థుల ఉద్యోగ అవకాశాలలో ప్రణాళిక లేని లక్ష్యంతో అపజయాలు ఎదురవుతాయని, ప్రణాళికతో ముందుకు సాగాలని ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ సభ్యుడు రాజుమహేంద్రనాథ్ సూచించారు. నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాలలో వ్యవస్థాపక నైపుణ్యాలపై చర్చ, వైఖరి, ప్రవర్తన అంశాలపై సదస్సు నిర్వహించారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణారెడ్డి సదస్సుకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజమహేంద్రనాథ్ మాట్లాడుతూ ఆలోచనలకు ఆచరణాత్మకంగా అమలు చేయడమే వ్యవస్థాపకత అని వ్యాపార, కంపెనీల ఏర్పాటులో లాభనష్టాలను తట్టుకోగలిగే సామర్థ్యం ఉన్న వారే ఆ రంగాల్లో రాణిస్తారని అన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవస్థాపకత అనేది అనిశ్చిత సమయాలను ఎదుర్కొంటూ సొంతంగా ముందుకు వెళ్లడమేనని సూచించారు. ప్రిన్సిపాల్ సుబ్బయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

'హత్యారాజకీయాలను వ్యతిరేకించాలి'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 5: హత్యారాజకీయాలను వ్యతిరేకించాలని సీపీఎం జిల్లాకార్యదర్శి రమేష్ కుమార్ అన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మహానంది మండలం సీతారామపురం గ్రామంలో జరిగిన హత్యారాజకీయ విబేధాలు తారాస్థాయికి చేరి హత్య జరిగిందని, ఇలాంటి వాటిని ఏ రాజకీయ పార్టీ సమర్థించకూడదని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదిరతులు పాల్గొన్నారు.

'సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం'

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు హర్షణీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ అన్నారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణ అమలు పై కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ తదిరతులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని సీపీఐ నాయకుడు రఘురామమూర్తి అన్నారు. సోమవారం నందికొట్కూరు సీపీఐ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ వర్గీకరణను సమర్థించడం హర్షనీయమన్నారు. సమావేశంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, దినేష్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

● ఎస్సీ, ఎస్టీ వర్గీకణ పోరాటానికి ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ నాయకుడు డా. రాజు అన్నారు. ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. సోమవారం పట్టణంలోని స్థానిక పటలే సెంటర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాది అరెస్టుపై నిరసన



కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నందికొట్కూరు, ఆగస్టు 4: న్యాయవాది గొల్ల శశిధర్‌ను అల్లంపూర్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జె. వెంకటరాముడు అన్నారు. సివిల్ వివాదంలో జోక్యం చేసుకొని అక్రమంగా, అన్యాయంగా అరెస్టు చేసిన అలంపూర్ పోలీస్ చర్యకు నిరసనగా న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి, విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జె.వెంకటరాముడు పాల్గొన్నారు.

సీఆర్ సిస్టం సరఫరాతో ఎక్స్‌రే సేవలు

● నంద్యాల జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ జఫ్రుల్లా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పాణ్యం, ఆగస్టు 5: సీఆర్ సిస్టం సరఫరా అయిన వెంటనే ఎక్స్‌రే సేవలు కొనసాగిస్తామని నంద్యాల డీసీహెచ్ఎస్ అధికారి డాక్టర్ జఫ్రుల్లా తెలిపారు. ఈనెల 5వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన రోగులకు అందని ఎక్స్‌రే సేవలు అన్న కథనానికి స్పందించిన డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా సోమవారం వివరణ ఇచ్చారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు బనగానపల్లె, డోన్, సీహెచ్‌సీ నుండిపెంటలలో ఎక్స్‌రే సేవలు పూర్తి స్థాయిలో రోగులకు అందుబాటులో ఉన్నాయన్నారు. మిద్దూరు, వెలుగోడు, నందికొట్కూరు, పాణ్యం, యాళ్లూరు, అవుకు, బేతంచెర్ల సీహెచ్‌సీలలో ఎక్స్‌రే యంత్రాలు సరఫరా చేశారన్నారు. అయితే వీటికి అనుసంధానంగా అవసరమైన ఎక్స్‌రే ప్రింటర్, ఎక్స్‌రే కన్సోల్, క్యాసెట్, సాఫ్ట్‌వేర్ సిస్టంలు సరఫరా కాకపోవడంతో ప్రారంభించ లేదన్నారు. పాణ్యానికి సీహెచ్‌సీకు 2024 ఫిబ్రవరిలో ఎక్స్‌రే యంత్రం సరఫరా అయిందన్నారు. ఎన్నికల కోడ్‌తో వీటికి సంబంధించిన భాగాలు రాలేదన్నారు. బేతంచెర్ల ఆసుపత్రికి దాతలు ఎక్స్‌రే యంత్రాన్ని విరా ళంగా ఇచ్చారన్నారు. ఆళ్లగడ్డ, ఆత్మకూరు, కోవెలకుంట్ల ఆసుపత్రులకు ఎక్స్‌రే యంత్రాలు మంజూరు కాలేదన్నారు. పాణ్యంలో కంటి వైద్యుడి పోస్టు లేదన్నారు. విజువల్ టెక్నీషియన్ పోస్టు మాత్రమే ఉందన్నారు. బనగానపల్లె, డోన్, ఆళ్లగడ్డ సీహెచ్‌సీలలో ఆపరేషన్ థియేటర్ల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. వీటిలో కంటి వైద్య పోస్టులు ఉన్నాయన్నారు.

ప్రతి ఎకరాకు సాగునీరు: బైరెడ్డి



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి

పగిడ్యాల, ఆగస్టు 5: నాగటూరు ఎత్తిపోతల పేజ్-1 నుంచి ప్రతి ఎకరాకు సాగు నీరు అందేలా కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. నాగటూరు ఎత్తిపోతల నీటి కమిటీ ఎంపికపై రైతులతో కలిసి సోమవారం సాయంత్రం లక్ష్మాపురం అంచె సమీపంలో సమావేశం నిర్వహించారు. బైరెడ్డి మాట్లాడుతూ ఎత్తిపోతల నుంచి ఎన్ని గ్రామాలకు నీరు అందాల్సి ఉందని అధికారులను ప్రశ్నించారు. ఎందుకు పూర్తి స్థాయిలో నీరు అందడం లేదని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎత్తిపోతల నుంచి నీరు పారేందుకు కాలువలు లేకపోవడం, నీటిని ఒక మోటార్ ద్వారా విడుదల చేయడంతో ఇబ్బందులు ఉన్నాయని, కమిటి నిర్వాహకుల ఇష్టానుసారంగా నీటిని విడుదల చేయడంతో సక్రమంగా నీరు పొలాలకు అందడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బైరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకాలకు కమిటీ చైర్మన్‌గా ఉన్న వాళ్లు రైతుల నుంచి ఇష్టానూసారంగా డబ్బులు వసూళ్లు చేశారు తప్ప రైతులకు నీరు అందజేసేందుకు ఎలాంటి పనులు చేపట్ట లేదన్నారు. మూడేళ్లుగా ట్రాన్స్‌పార్మర్ మరమ్మతులకు గురైనా రిపేరి చేయడానికి కమిటీ సభ్యులు, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని అన్నారు. ట్రాన్స్‌పార్మర్‌ను రిపేరి చేయించి రెండు మోటార్ల ద్వారా నీటిని అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. నాయకులు ఆలివుసేన్, కట్టుబడి శ్రీనివాసులు నాయుడు, జయరామిరెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.

'ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు'

ఆత్మకూరు, ఆగస్టు 5: ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులను పొందవచ్చని ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, అడ్మిస్ట్రేషన్ ఆఫీసర్ మోహన్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తుల అమ్మకం కేంద్రాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉండటమే కాకుండా రోగనిరోధకశక్తిని పెంపొందించుకోవచ్చునని తెలిపారు. ఏపీఎం ఉమామహేశ్వరి, ఎస్ఆర్‌పీ నరేంద్రగౌడ్ తదితరులు ఉన్నారు.

'పంట నమోదు తప్పనిసరి'

ఆత్మకూరురూరల్, ఆగస్టు 5: ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని కురుకుంద, శ్రీపతిరావుపేట గ్రామాల్లో ఎంపీఈవోలు చేపడుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేసిన పంటలకు తప్పనిసిరగా ఈ క్రాప్ చేయంచుకోవాలన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత పంటల పరిస్థితులపై ఆరా తీశారు. ప్రస్తుతం రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

వెలుగోడు: పంటలు సాగు చేసిన ప్రతి ఒక్కరూ ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని మోతుకూరు, వెలుగోడు గ్రామాలలో ఖరీఫ్ సాగు చేసిన పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఆయా పంట పొలాల్లో సిబ్బంది నమోదు చేసిన ఈ క్రాప్ వివరాలను ఆయన తనిఖీ చేసి వివరాలను తెలుసుకున్నారు. ఏవో మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో ఏ సర్వే నంబర్‌లో ఏ రకం పంట ఎంత విస్తీర్ణం సాగు చేశారో నమోదు చేస్తున్నారన్నారు.యాప్‌లో నమోదు చేసిన వివరాలన్నీ రైతులు ఈకేవైసీ ద్వారా తెలుసుకోవచ్చొన్నారు. ఈ ఎంపీఈవోలు రామకృష్ణ, నాగమని, నాగలింగం, రైతులు పాల్గొన్నారు.

దేశాన్ని అస్థిరపరిచే చర్యలను
ఐక్యతతో తిప్పి కొట్టాలి

మేధావుల వేదికలో రాజకీయ విశ్లేషకులు సుధాకర్



మాట్లాడుతున్న రాకా సుధాకర్

కర్నూలు (కల్చరల్), ఆగస్టు 5: దేశాన్ని అస్థిరపరిచే చర్యలను హిందువులంతా ఐక్యతతో తిప్పి కొట్టాలని, మణిపూర్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలు కూడా అలాంటివేనని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, రాకాలోకం చీఫ్ ఎడిటర్ రాకా సుధాకర్ అన్నారు. సోమవారం రాత్రి నగరంలోని వెంకటరమణ కాలనీలోగల శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ మంటపంలో కర్నూలు సమాలోచన (మేధావుల వేదిక) సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాలో సెక్యులర్ ముసుగులో జరుగుతున్న హిందూ వ్యతిరేక కార్యకలాపాలపై సుధాకర్ ప్రస్తావించారు. మణిపూర్ సంఘటన రెండు గిరిజన తెగలకు సంబంధించిన అంశమని, దాన్ని ఆయా తెగల పెద్దల ద్వారానే సమావేశాలు జరిపి పరిష్కరించాల్సిన అంశాలని అన్నారు. ఎక్కడో మణిపూర్‌లో సంఘటన జరిగితే అమెరికా లాంటి దేశంలోని పత్రికల్లో వస్తాయని, దేశంలో అస్థిర పరిస్థితులను నెలకొల్పేందుకు అమెరికా లాంటి దేశాలు యత్నిస్తున్నాయని చెప్పారు. భారత ప్రధాని కూడా మణిపూర్ ఘనట అంశంలో ఆలోచించి, సమస్యను పూర్తిస్థాయిగా రూపుమాపే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంయుఓజిక్ ఎస్‌వీకే మల్లికార్జున రావు, వీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ వాసురెడ్డి, విశ్రాంత ఇంజినీర్ రఘురామయ్య పాల్గొన్నారు.

భారీ వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న

● పంటను దున్నేసిన కౌలు రైతు



నందికుంట గ్రామ శివారులో దెబ్బతిన్న పైరును ట్రాక్టరుతో దున్నేస్తున్న కౌలు రైతు

కొత్తపల్లి, ఆగస్టు 5: ఇటీవల ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న పైరులో నీరు నిల్వ ఉండి.. ఎదుగుదల లేక పంట దెబ్బతింది. దీంతో ఏకంగా కౌలు రైతు మొక్కజొన్న పైరును సోమవారం ట్రాక్టరుతో దున్నేశారు. కొత్తపల్లి మండలం నందికుంట గ్రామానికి చెందిన చిమ్మో మారెన్న అనే కౌలు రైతు గ్రామానికి చెందిన మౌలాలి అనే రైతు నుంచి ఏడెకరాల పొలాన్ని రూ.70 వేలుకు కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంటను సాగు చేశారు. అయితే ఇటీవల పది రోజుల పాటు కురిసిన వర్షాలకు మొక్కజొన్న పంటలో నీరు నిల్వగా ఉండి పంట కుళ్లిపోయింది. దీంతో పంట ఎదుగదల లేకపోవడంతో ఆ రైతు ట్రాక్టరుతో దున్నేశారు. ఇప్పటికే రైతుకు పంట పెట్టుబడితో పాటు కౌలుకు తీసుకున్న నగదు మొత్తం రూ.2 లక్షల మేర పంట నష్టం జరగడంతో కన్నీరు మున్నీరై విలపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఏడెకరాలను కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంటను సాగు చేశాను. భారీ వర్షాలకు ప్రకృతి సహకరించకపోవడంతో పంట పూర్తిగా దెబ్బతింది. పైరు ఎదుగుదల లేకపోవడంతో దున్నేశాను. అధికారులు దెబ్బతిన్న పంటను పరిశీలించి న్యాయం చేయాలి.

- మారెన్న కౌలు రైతు, నందికుంట

'బ్రిడ్జి నిర్మించాలి'

ఆత్మకూరు, ఆగస్టు 5: మండలంలోని కరివేన గ్రామ పంచాయతీ పరిధిలోని చర్కా కాలనీలోకి వెళ్లే రహదారిపై అండర్‌పాస్ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం నాయకులు రణధీర్, వెంకటేశ్వర్లు, సుధాకర్ కోరారు. సోమవారం తహసీల్దార్ రత్నరాధికకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న బైపాస్ రహదారి చర్కా కాలనీ రస్తా మీదుగా వెళ్తుందని అన్నారు. అయితే ఆ ప్రదేశంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించకపోతే ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వయనాడ్ వరద బాధితులను ఆదుకోవాలి: సీపీఎం

ఆత్మకూరు, ఆగస్టు 5: వయనాడ్ వరద బాధితులను జాతీయ విపత్తుగా పరిగణించి కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు రాజశేఖర్, రణధీర్ కోరారు. సోమవారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వయనాడ్ వరద బాధితుల కోసం నిధులను సేకరించారు. నాయకులు రామ్‌నాయక్, రామన్న, గణపతి, అంబయ్య, సామేలు, మహ్మద్ ఉన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆత్మకూరురూరల్, ఆగస్టు 5: ఆత్మకూరు మండలం సిద్ధాపురం, సిద్ధపల్లి గ్రామ అటవీ శివార్లలో ఆత్మకూరు సెబ్ టీం, పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం మూకుమ్మడిగా నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. సెబ్ సీఐ మారుతిరావు మాట్లాడుతూ ఆయా అటవీ ప్రాంతాల్లో నాటుసారా స్థావరాలను గుర్తించి బట్టీ వద్ద ఉన్న 1100 లీటర్ల బెల్లపు ఊటను, 20 లీటర్ల నాటుసారాను, నాటుసారా తయారీ సామగ్రిని ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ శంకర్‌నాయక్, మనోహర్, కానిస్టేబుళ్లు జగదీష్, రామేష్, నాగరాజు పాల్గొన్నారు.

'తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి'

పాణ్యం, ఆగస్టు 5: విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఆర్జీఎం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు సూచించారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల సోమవారం ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మట్లాడారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలన్నారు. ఎన్నో ఒడిదుడుకులను అధిగమించి పిల్లలను చదివించి మంచి ప్రయోజకులుగా చూడాలనుకున్న తల్లిదండ్రుల ఆశలను నీరుగార్చవద్దని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డీన్ డాక్టర్ అశోక్ కుమార్, కోయంబత్తూరు బైట్స్ ట్రైనింగ్ కంపెనీ సీఈవో కార్తీక్, డాక్టర్ రామిరెడ్డి, డాక్టర్ సుదర్శన్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'కంటి అద్దాలను సద్వినియోగం చేసుకోవాలి'



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

ఆత్మకూరురూరల్, ఆగస్టు 5: ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న కంటి అద్దాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కంటి వైద్య నిపుణుడు షేక్షావలి సూచించారు. మండలంలోని నల్లకాలువ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో సోమవారం 103 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అందులో దృష్టిలోపం ఉన్న ఇద్దరు విద్యార్థులను గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం చల్లనినీటితో కళ్లను శుభ్రం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎక్కువగా మొబైల్ చూడటం, టీవీకి దగ్గరగా కూర్చొని చూడటం వల్ల దృష్టిలోపాలు ఏర్పడతాయని తెలిపారు. విటమిన్-ఎ ఎక్కువగా లభించే క్యారెట్, బొప్పాయి,తాజా ఆకుకూరలను తినడం వల్ల కనుదృష్టిని మెరుగు పరుచుకోవచ్చని సూచించారు. సీహెచ్‌వో శివ వైద్య సిబ్బంది భాస్కర్, శారద, ఆశా వర్కర్లు నాగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న ఈవో, అర్చకులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, ఆగస్టు 5: శ్రీశైలం మహాక్షేత్రంలో సోమవారం శ్రావణ మాసోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సెప్టెంబరు 4న ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా లోకకల్యాణం కోసం దేవస్థానం శివచతుస్సప్తాహ భజనలను ఆలయ ప్రాంగణంలోని వీరశిరో మండ పంలో ప్రారంభించారు. ఈ పవిత్ర అఖండ భజనలు శ్రావణమాసం ముగిసే వరకు రేయింబవళ్లు నిరంతరం జరుపుతారు. శ్రావణమాసం ప్రారంభం, సోమవారం రావడంతో భక్తులు క్షేత్రానికి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. భక్తు లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం విస్తృత ఏర్పాట్లను చేప ట్టింది. భక్తులకు కల్పించే సౌకర్యాలను పర్యవేక్షించేందుకు దేవస్థానం కార్యా లయ సిబ్బందికి ప్రత్యేక విధులను ఆలయ ఈవో డి.పెద్దిరాజు కేటాయిం చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సోమవారం ఆల యంలోని దర్శనం క్యూలైన్లు, ఉచిత ప్రసాద వితరణ, లడ్డు ప్రసాదాల విక్రయకేంద్రాలు, అన్న ప్రసాద వితరణ మొదలైన వాటిని పరిశీలించారు.

చంద్రబాబు పాలనలో రైతులే రాజులు

- చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం
- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ




తుండ్లవాగు రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

రుద్రవరం, ఆగస్టు 5: ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో రైతులే రాజులు అని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. సోమవారం సాయంత్రం నల్లమల తీరంలోని తుండ్లవాగు రిజర్వాయరు నుంచి కడప జిల్లా బ్రహ్మంసాగర్‌కు వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. అలాగే రుద్రవరం మండలంలోని గండ్లేరు వాగుకు గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వాగు ద్వారా ఆలమూరు, యాదవాడ, ఓబులంపల్లె వాగుకు సాగునీరు అందుతుందని అన్నారు. తెలుగుగంగ ప్రధాన కాల్వ స్వర్గీయ ఎన్టీరామారావు పుణ్యమే అని, దానిని పూర్తి చేయడంలో చంద్రబాబునాయుడు సహకారం ఎంతో ఉందని అన్నారు. తుండ్లవాగు రిజర్వాయరును 3 టీఎంసీల నుంచి 8 టీఎంసీగా స్థాయిని పెంచేందుకు గతంలో రూ.40 కోట్లతో నివేదికలు పంపామని చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణానికి తాగునీటి సమస్య తలెత్తకుండా తుండ్లవాగు రిజర్వాయరు నుంచి నీటి సరఫరా చేయాలని అధికారులతో చర్చించామన్నారు. అలాగే తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ చానళ్ల పూర్తిస్థాయిలో పనులు చేయించి చివరి ఆయకట్టుకు సాగునీరు అందించి రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కేసీ కెనాల్ రైతుల సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. సీఎం చంద్రబాబు, సాగునీటి శాఖ మంత్రి దృష్టికి తుండ్లవాగు రిజర్వాయరు స్థాయిని పెంచే వారి దృష్టికి తీసుకువెళతామన్నారు. సీమలోని ఒక్కో ప్రాజెక్టు సమస్యను సీఎం చంద్రబాబు పరిష్కరిస్తూ రాయలసీమను సస్యశ్యామలం చేయనున్నారని ఆమె అన్నారు. ఈఈ శంకర్‌రెడ్డి, డీఈలు రఘురామిరెడ్డి, రమణ, ఏఈలు మోహనకృష్ణారెడ్డి, శిరీష, రాంప్రసాద్ ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ: చిలకలూరు గ్రామానికి చెందిన రోషన్‌బీ (50) అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'వారబంది విధానంలో టీజీపీ సాగు నీరు'



చిన్నవంగలి సమీపంలో టీజీపీ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఈఈలు, డీఈలు

చాగలమర్రి, ఆగస్టు 5: తెలుగుగంగ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో రైతులకు వారబంది విధానంలో సాగునీరు విడుదల చేస్తామని టీజీపీ ఈఈ శివశంకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిన్నవంగలి గ్రామ సమీపంలోగల తెలుగుగంగ ప్రధాన కాలువలో ప్రవహిస్తున్న నీటి మట్టాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. 58 కి.మీ. నుంచి 96.130 కి.మీ. వరకు ప్రధాన కాలువ వెంట పర్యటించారు. 28వ బ్లాక్ నుంచి 37వబ్లాక్ వరకు, నంద్యాల జిల్లా కడప బార్డర్‌లోగల 96.130 కి.మీ. వద్ద కడప జిల్లా పోరుమామిళ్ల ఈఈ క్రిష్ణారెడ్డితో కలిసి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. సాగునీరు బ్లాక్‌ల వారీగా విభజించి వారం విడిచి వారం సాగునీరు అందిస్తామని తెలిపారు. ప్రస్తుతం కాలువలో 2,648 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని, వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వార 5 వేల క్యూసెక్కులు విడుదల చేశారని ఈఈలు పేర్కొన్నారు. ఆయకట్టు రైతులు సాగు నీటి కోసం ఎలాంటి అనుమతి లేకుండా గేట్లను ఎత్తితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. టీజీపీ డీఈ వెంకటరమణ, ఏఈలు సలీమ్, నియాజ్ అహ్మద్, వినయ్‌కుమార్, పోరుమామిళ్ల ఏఈలు నాగిరెడ్డి, అనిత, రామమోహన్, టీజీపీ సిబ్బంది ఉన్నారు.

ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి



పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, ఆగస్టు 5: విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అన్నారు. సోమవారం బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీసీ ఇందిరమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు నోటుపుస్తకాలు, పాఠ్య పుస్తకాలు బీసీ ఇందిరమ్మ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

మెరుగైన వైద్యం అందించండి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి అబ్దుల్ రెహ్మాన్

కోవెలకుంట్ల, ఆగస్టు 5: పేద విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ అబ్దుల్ రెహ్మాన్ అన్నారు. సోమవారం ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు కోవెలకుంట్ల పట్టణంలోని హరిబాల ట్రస్టులో కోవెలకుంట్ల న్యాయాధికారి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్యాంపులో డాక్టర్ చంద్రశేఖరరెడ్డి డాక్టర్ సుజనా వైద్యసిబ్బంది పాల్గొని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మినీ గోకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల, ఆగస్టు 5: మినీ గోకులాల నిర్మాణాల షెడ్ల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని కోవెలకుంట్ల పశు సంవర్ధకశాఖ అధికారి కె. వీరబ్రహ్మం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోవెలకుంట్ల పశు సంవర్ధకశాఖ పరిధిలో కోవెలకుంట్ల, గోస్పాడు మండలాలు ఉన్నాయన్నారు. ఒక్కో మండలానికి 25 గోకుల షెడ్లు మంజూరయ్యాయన్నారు. రెండు పశువుల మినీ గోకుల షెడ్లకు యూనిట్ విలువ రూ.లక్షా 15వేలు, ఉపాధి హామీ పథకం నిధులు లక్షా 3500, రైతు వాటా 11,500, నాలుగు పశువులు కలిగిన మినీ గోకుల షెడ్డుకు యూనిట్ విలువ లక్షా 85వేలు, ఉపాధి హామీ పథకం నిధులు 1,65,500, రైతు వాటా 18500, ఆరు పశువులు కలిగిన నిర్మాణానికి యూనిట్ విలువ 2.35 లక్షలు, ఉపాధి నిధులు 2.07 లక్షలు, రైతు వాటా 23వేలు, అలాగే గొర్రెలు, మేకల షెడ్డుకు 20 జీవాలు కలిగిన షెడ్డు కోసం యూనిట్ విలువ రూ.1.30 లక్షలు, ఉపాధి నిధులు 91వేలు, రైతు వాటా 39వేలు, 50 జీవాలు కలిగిన షెడ్డుకు యూనిట్ విలువ రూ.2.30 లక్షలు, ఉపాధి నిధులు లక్షా 65వేలు, రైతు వాటా 69 వేలు, అలాగే వంద కోళ్లు కలిగిన షెడ్డు నిర్మాణానికి యూనిట్ విలువ రూ.87 వేలు, ఉపాధి నిధులు 69,900, రైతువాటా 26,100, 200 కోళ్లు కలిగిన షెడ్డు నిర్మాణం కోసం యూనిట్ విలువ 1.32లక్షలు, ఉపాధి నిధులు 92,400, రైతు వాటా 39,600 చెల్లించాలని తెలిపారు.

కొలిమిగుండ్ల: పాడి పరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రభుత్వం సబ్సిడీపై మినీ గోకులం షెడ్ల నిర్మాణం చేపడుతోందని, ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ పద్మావతి సోమవారం తెలిపారు. పశువుల షెడ్లకు సంబంధించి ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందిస్తుందని అన్నారు.

'విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి'

రుద్రవరం, ఆగస్టు 5: విద్యార్థులు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయవద్దని, ఆరోగ్యం ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఆర్బీఎస్‌కే వైద్యాధికారి కాంతారావు సూచించారు. సోమవారం రుద్రవరం ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, కేజీబీవీ, గురుకుల విద్యాలయం సందర్శించారు. ఐరన్ ట్యాబ్లెట్లు ప్రతి గురువారం ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివమోహన్, బాబు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణకు టీకాలు వేయించుకోవాలి

బనగానపల్లె, ఆగస్టు 5: 60 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు క్షయవ్యాధి నివారణకు బీసీజీ టీకాలు వేయించుకోవాలని పలుకూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎం.హెచ్‌ఈవో సుబ్బరాయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని మూడో సచివాయం పరిధిలోని ఆస్థానం వీధిలో అర్హులైన వారికి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బనగానపల్లె సీఐగా మంజునాథరెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 5: బనగానపల్లె రూరల్ సీఐగా మంజునాథరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బనగానపల్లె సీఐగా ఉన్న గంటా సుబ్బారావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మంజునాథరెడ్డి సీఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. బనగానపల్లె సర్కిల్ పరిధిలోని నందివర్గం ఎస్ఐ తిరుపాలు, పోలీస్ సిబ్బంది సీఐ మంజునాథరెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం

కొలిమిగుండ్ల, ఆగస్టు 5: కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 9న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి ఆదివారం తెలిపారు. ఎంపీపీ నాగవేణి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

బేతంచెర్ల, ఆగస్టు 5: విద్యారంగ సమస్యలపై విద్యార్థులు పోరాటానికి సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు ఎంఆర్ నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు నరసింహ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు ధరలకు అనుగుణంగా మెస్ చార్జిలు చెల్లించాలని, పెండింగ్ కాస్మోటిక్ చార్జీలు ఇవ్వాలని, జీవో 77ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చరణ్ నాయక్, కార్యదర్శిగా నరసింహ, సహాయ కార్యదర్శులుగా రవీంద్రనాయక్, తిరుమేష్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, సాయి, సభ్యులను ఎన్నుకున్నారు.

ఎన్‌హెచ్-544డి రహదారికి మరమ్మతులు



గుంతలు పూడ్చుతున్న సిబ్బంది

కొలిమిగుండ్ల, ఆగస్టు 5: అనంతపురం- అమరావతి ఎన్‌హెచ్-544డి రహదారికి మరమ్మతులు నిర్వహిస్తున్నారు. మండలంలోని కొలిమిగుండ్ల, బెలుం, అవుకు మండలంలోని రామాపురం, చెర్లోపల్లె తదితర గ్రామాల వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చే పనులను చురుగ్గా నిర్వహిస్తున్నారు.

'ప్రతి నెల ఐదో తేదీలోగా జీతాలు అందించాలి'

రుద్రవరం, ఆగస్టు 5: ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు అందేలా చూడాలని వీఆర్ఏలు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలో 74 మంది వీఆర్ఏలుగా పనిచేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారులు స్పందించి జీతాలు అందేలా చేయాలని విజ్ఞప్తి చేశారు.

'చదువుతోపాటు క్రీడలు అవసరం'

ఆళ్లగడ్డ, ఆగస్టు 5: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని టీడీపీ నాయకుడు, కాటన్‌బోర్డు మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి (వాసు) అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినిలకు క్రికెట్ కిట్లు, షటిల్ బ్యాడ్మింటన్ బ్యాట్స్ కొనుగోలు కోసం సోమవారం రూ.11 వేలు విరాళం అందించారు. ఆయన క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కళాశాల ప్రిన్సిపాల్ శివరామయ్యకు, వైస్ ప్రిన్సిపాల్ గంగన్నకు తెలిపారు.

'సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'

చాగలమర్రి, ఆగస్టు 5: సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు డాక్టర్ ఇమ్రాన్ సూచించారు. సోమవారం అజీమ్ బ్రిలియంట్ ఉన్నత పాఠశాల సమీపంలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అతిసార, మెదడువాపు, టైఫాయిడ్ జ్వరాలపై అవగాహన కల్పించారు. వ్యాధులు సోకిన వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హెచ్ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సమత, ఏఎన్ఎం లీలావతి, శేఖర్, ఆశా వర్కర్లు ఉన్నారు.

ప్రసన్నకు మనోధైర్యం నింపిన ఆర్డీవో



బాలికను ఓదారుస్తున్న ఆర్డీవో

చాగలమర్రి, ఆగస్టు 5: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో మట్టిమిద్దె కూలి ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడం దురదృష్టకరమని ఆర్డీవో మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నవంగలి గ్రామంలో తల్లిదండ్రులు, అక్కా చెల్లెళ్లను కోల్పోయిన ప్రసన్నను ఓదార్చారు. బాలికకు సీఎం చంద్రబాబునాయుడు స్పందించి రూ.10 లక్షలు, నానమ్మకు రూ.2 లక్షలు పంపిణీ చేయాలని ఆదేశాలు జిల్లా కలెక్టర్‌కు ఇవ్వడంతో ఆమె స్పందించి చెక్కును మంజూరు చేశారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, వీఆర్వో సుబ్బరాయుడు, కార్యదర్శి నాగార్జున, టీడీపీ నాయకులు ఉన్నారు.

'మట్టిమిద్దెల యజమానులను అప్రమత్తం చేయాలి'



మాట్లాడుతున్న ఎంపీడీవో రఘురామ్

ఉయ్యాలవాడ, ఆగస్టు 5: మండలంలో అన్ని గ్రామాల్లో మట్టిమిద్దెలలో నివాసం ఉంటున్న యజమాలను అప్రమత్తం చేయాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా వారు ఇళ్లు ఖాళీ చేసేలా నోటీసులు ఇవ్వాలని ఎంపీడీవో రఘురామ్ సూచించారు. సోమవారం ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ ఏఈ నరసింహారావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మట్టి మిద్దెల్లో నివాసం ఉంటున్న వారికి తగిన జాగ్రత్తలు, సూచనలు ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న మట్టి మిద్దెలను గుర్తించి, వాటిలో నివాసం ఉండకుండా ఖాళీ చేయించాలని సూచించారు. పెడింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హౌసింగ్ ఏఈ హెచ్చరించారు.

'పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు': గామాల్లో పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని ఈవోపీఆర్డీ మహేందర్‌రెడ్డి హెచ్చరించారు. కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓహెచ్ఎస్సార్ ట్యాంకుల ద్వారా సరఫరా అయ్యే నీటికి ప్రతి రోజు క్లోరినేషన్ చేయాలన్నారు. 15 రోజులుకు ఒక సారి నీటి తొట్లను శుభ్రం చేయాలన్నారు. శుభ్రం చేసిన అనంతరం ట్యాంకులపై శుభ్రం చేసిన తేదీని దానిపై రాయాలన్నారు. నీరు నిల్వ ఉన్న, బురద ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ మండల కో-ఆర్డినేట్ రమణారెడ్డి పాల్గొన్నారు.

బేతంచెర్ల సీఐగా వెంకటేశ్వరరావు



ఎమ్మెల్యే కోట్లకు పూల మొక్క అందజేస్తున్న బేతంచెర్ల సీఐ

బేతంచెర్ల, ఆగస్టు 5: పట్టణంలోని యూపీఎస్ పోలీస్‌స్టేషన్ సీఐగా వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల క్షేత్రాన్ని సీఐ సందర్శించి పూజలు చేశారు. అనంతరం బేతంచెర్ల పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రియతమ్ రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రభుత్వం బేతంచెర్ల యూపీ సీఐగా వెంకటేశ్వరావును నియమించారు. బేతంచెర్ల సీఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరరావును ఎస్ఐ శివశంకర్ నాయక్, పోలీసు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

డోన్: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని సోమవారం బేతంచెర్ల సీఐ వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలోని కోట్ల నివాసంలో ఎమ్మెల్యే కోట్లకు పూల బొకేను సీఐ అందజేశారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను సీఐ వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసారు. మట్కా, పేకాట, గంజాయి, నాటుసారాలను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవలని ఎమ్మెల్యే కోట్ల సీఐకి సూచించారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు





డోన్‌లో ఆందోళన చేస్తున్న న్యాయవాదులు, ఆళ్లగడ్డలో..

డోన్(రూరల్), ఆగస్టు 5: డోన్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు ప్రధాన రోడ్డులో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఈ వేణుగోపాల్ గౌడు, ఉపాధ్యక్షులు బద్దెల వెంకటేశ్, ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో న్యాయవాది సుబ్బరామిరెడ్డిపై దురుసుగా ప్రవర్తించిన నంద్యాల టూ టౌన్ సీఐ రాజారెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ న్యాయవాది సుబ్బరామిరెడ్డిపై దురుసుగా ప్రవర్తించిన నంద్యాల టూ టౌన్ సీఐ రాజారెడ్డిపై చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కోర్టు విధులను బహిష్కరించారు. రెండు రోజుల పాటు విధులను బహిష్కరించనున్నట్లు న్యాయవాదులు చెప్పారు.

'రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి'

శిరివెళ్ల, ఆగస్టు 5: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ పుష్ప కుమారి తెలిపారు. శిరివెళ్ల తహసీల్దార్‌గా ఆమె సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని గ్రామాలు, రెవెన్యూ పరమైన అంశాల గురించి ఆమె చర్చించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ పుష్ప కుమారిని ఉప తహసీల్దార్ నర్సిరెడ్డి, ఆర్ఐ సుచరిత, మండలంలోని వీఆర్వోలు, సర్వేయర్లు శాలువా, పూలమాలలతో సన్మానించారు. మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, టీడీపీ నాయకులు పీపీ లింగమయ్య, నాగ లింగమయ్య, తిరుమల రవి, బ్రహ్మయ్య, గోపాల్ తదితరులు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

తహసీల్దార్లుగా బాధ్యతల స్వీకరణ

ఉయ్యాలవాడ, ఆగస్టు 5: ఉయ్యాలవాడ మండల తహసీల్దారుగా బి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎలక్షన్ అధికారిగా కడప జిల్లాలో విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడి వచ్చారు. తహసీల్దార్ శ్రీనివాసులుకు ఆర్ఐ తులసీకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం వీఆర్వోలు శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. గ్రామ సర్వేయర్లు మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్యాపిలి: ప్యాపిలి తహసీల్దారుగా భారతి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు ప్రతాప్ రెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీ కాగా గుత్తిలో పనిచేస్తున్న భారతిని ప్రభుత్వం ఇక్కడ నియమిస్తూ ఆదేశాలిచ్చింది. ఈసందర్భంగా భారతి మాట్లాడుతూ రైతులు సమస్యలుంటే నేరుగా తమను సంప్రదించాలన్నారు.

దొర్నిపాడు: దొర్నిపాడు మండల తహసీల్దార్‌గా సుభద్ర సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో విధులు నిర్వహించిన నాగరాజు బదిలీల్లో భాగంగా ఆదోనికి వెళ్లడంతో ఆయన స్థానంలో దొర్నిపాడు తహసీల్దార్‌గా సుభద్ర బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఆళ్లగడ్డలోని స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియను శిరివెళ్ల తహసీల్దార్ పుష్పకుమారి, ఆళ్లగడ్డ తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆళ్లగడ్డ తహసీల్దార్‌గా జ్యోతి రత్నకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రజల, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పారు.

జాతీయ చేనేత దినోత్సవానికి ఆహ్వానం

ఆళ్లగడ్డ, ఆగస్టు 5: ఢిల్లీలో ఈనెల 7వ తేదిన జరుగనున్న 10వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలకు ఆళ్లగడ్డకు చెందిన న్యాయవాది, కర్నూలు కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ పుత్తా మురళీబాబును కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది.

రాష్ట్రస్థాయి పోటీలకు పేరుసోమల విద్యార్థినులు

సంజామల, ఆగస్టు 5: రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు పేరుసోమల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 4న నంద్యాల గుడ్‌షెప్పర్డ్ స్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాఠశాలకు చెందిన చంద్రిక, దివ్యశ్రీ, కల్పన, దస్తగిరిమ్మ, వైష్ణవి, అమృత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. సెప్టెంబరు 11న అన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని హెచ్.ఎం సీతారావమ్మ సోమవారం తెలిపారు. పాఠశాలలో అభినందన సభను ఏర్పాటు చేసి విజేతలను అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సైన్స్ మేడా హరిప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థిని సాన్వితా ఎంపికైనట్లు సెయింట్ జోసెఫ్ స్కూలు ప్రిన్సిపాల్ సిస్టర్ గీతా సోమవారం తెలిపారు. నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాణించి సెప్టెంబరు మొదటి వారం వైజాగ్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మేరీ, ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నరాజచెరువు గట్టుకు మరమ్మతులు



చిన్నరాజచెరువు గట్టుకు ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చుతున్న కూలీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రుద్రవరం, ఆగస్టు 5: మండలంలోని కొండమాయపల్లె చిన్న రాజచెరువు గట్టు ప్రమాదకరంగా ఉందని ఆంధ్రజ్యోతిలో ఈ నెల 2న కథనం ప్రచురితమైంది. మైనర్ ఇరిగేషన్ అధికారులు స్పందించారు. సోమవారం డీఈ గురుమూర్తి, ఏఈ మునాఫ్ చెరువు గట్టును పరిశీలించారు. చెరువు గట్టుకు కూలీలచే మరమ్మతులు చేయించారు. రైతులు చెరువు విషయంలో సహకరించాలని డీఈ, ఏఈ కోరారు.

'గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి'



మాట్లాడుతున్న ఏపీడీ సాంబశివరావు

చాగలమర్రి, ఆగస్టు 5: గృహ నిర్మాణ పనులు వేగవంతం చేసుకోవాలని ఉపాధి ఏపీడీ సాంబశివరావు పేర్కొన్నారు. సోమవారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏ, ఈసీ, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ సహాయకుల సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ చాగలమర్రి గ్రామంలోని 5 లే అవుట్‌లలో గృహ నిర్మాణాల పనులు చేయడానికి 90 రోజుల పనిదినాలు కూలీలకు కల్పిస్తామని, లబ్ధిదారుల ఖాతాకు నిధులు జమ చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని బేస్‌మెంట్‌లు పూర్తి చేసుకోవాలని సూచించారు. 1,500 గృహాలకు ఉపాధి పనులు చేయడానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఉపాధి సిబ్బంది, హౌసింగ్ సిబ్బంది కలిసి ఇంటింటి సర్వే చేసి గృహాల పనులు వేగవంతం చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, ఏపీవో నిర్మల, హౌసింగ్ ఏఈ షఫీవుల్లా పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ఉయ్యాలవాడ, ఆగస్టు 5: రూపనగుడి గ్రామంలో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ కొత్త చట్టాల్లో కఠినమైన శిక్షలు ఉన్నాయన్నారు. గ్రామంలో పంతాలు పట్టింపులకు పోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామంలో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా వచ్చే లోనుపై జాగ్రత్తగా ఉండాలన్నారు. రుణాల పేరుతో ప్రజలకు వల వేసి సైబర్ నేరగాళ్లు ఇబ్బందులకు గురి చేస్తారన్నారు. భూతగాదాలాంటి సమస్యలు ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. హెడ్‌కానిస్టేబుల్ రఫీ, రమేష్, సుబ్బయ్య ఉన్నారు.

ప్రజా వేదిక సమస్యలకు సత్వర పరిష్కారం

కొలిమిగుండ్ల, ఆగస్టు 5: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో లభించే దరఖాస్తులకు సత్వర పరిష్కారం లభించేలా చర్యలు చేపడుతున్నామని కొలిమిగుండ్ల తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

ప్యాపిలి, ఆగస్టు 5: ప్రభుత్వ పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ఈనెల 8న నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వరనాయక్ తెలిపారు. సోమవారం ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ వివరాలను ఎంపీడీవో సాయి మనోహర్‌కు అందజేశారు.

పైప్‌లైన్ లీకేజీలపై ప్రత్యేక దృష్టి

కొలిమిగుండ్ల, ఆగస్టు 5: కొలిమిగుండ్లలో పైప్‌లైన్ లీకేజీలపై ప్రత్యేక దృష్టి సారించించినట్లు సర్పంచ్ శివరాముడు అన్నారు. సోమవారం శాంతినగర్‌లో పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. మోటారు మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ అన్నారు.

'పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి'

చాగలమర్రి, ఆగస్టు 5: గ్రామాల్లో పండ్ల తోటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపాధి ఏపీడీ సాంబశివరావు సూచించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల పాల్గొన్నారు.

యాగంటిలో పల్లకీసేవ

బనగానపల్లె, ఆగస్టు 5: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, భక్తులు, ఆలయ పూజారులు స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

తుండ్లవాగు రిజర్వాయర్‌కు జలకళ

రుద్రవరం, ఆగస్టు 5: నల్లమల తీరంలోని తుండ్లవాగు రిజర్వాయరు నిండుకుండలా దర్శనమిస్తోంది. తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి కృష్ణాజలాలు చేరాయి. రిజర్వాయరు మొన్నటి వరకు వెలవెలబోయింది. కృష్ణాజలాలతో రిజర్వాయరులో జలకళ సంతరించుకుంది. 0.40టీఎంసీ నీరు నిల్వ ఉందని ఈఈ శంకర్‌రెడ్డి సోమవారం సాయంత్రం తెలిపారు.

ప్రతి ఇంటికి కొళాయి': మండలంలో ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి కనెక్షన్ ఇచ్చేలా సర్వే నిర్వహిస్తామని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ అన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల ద్వారా జలజీవన్ పథకం కింద ఈ సర్వే జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో సర్వే చేయించి ఇంటికి కొళాయి ఉందా? లేదా? అన్న వివరాలు సేకరిస్తామన్నారు.